## క్లుప్తంగా

### ఉత్సాహంగా జోనల్ స్థాయి క్రీడలు



మరిపెడ: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 9వ జోనల్ స్థాయి గేమ్స్ శనివారం ఉత్సాహంగా కొనసాగాయి. కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, హ్యాండ్ బాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, చెస్, క్యారమ్స్, రన్నింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన విజేతలకు మున్సిపల్ కమిషనర్ రాజు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### డాక్టరేట్ ప్రదానం



కురవి: సీరోలు మండలం చింతపల్లి శివారు భీక్యానాయక్ తండాకు చెందిన భూక్య బాలాజీ–కాళీల కుమారుడు డాక్టర్ భూక్య రవికుమార్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా(డాక్టరేట్) పొందాడు. 'బహుళ స్థాయి ఇన్వర్టర్ ఫెడ్ ఇండక్షన్ మోటార్ డ్రైవ్ కోసం ప్లస్ వెడల్పు మాడ్యులేషన్ టెక్నిక్ యొక్క విశ్లేషణ, రూపకల్పన అండ్ అమలు' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి పరిశోధన పూర్తి చేశాడు.

### బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు



కేసముద్రం: తప్పుడు హామీలతో గద్దెనెక్కిన బీఆర్‌ఎస్‌కు, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అమీనాపురం గ్రామంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గంధసిరి శ్రావణ్, చిట్ల సంపత్, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, సామ సుధాకర్‌రెడ్డి, నాగేంద్రబాబు, నేతాజీ పాల్గొన్నారు.

### పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి

కురవి: రాబోయే ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కొత్తూరు(సీ) గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సూడి ఉప్పయ్య, ప్రధాన కార్యదర్శి చిట్టూరి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సోడం కర్ణ, గుర్వయ్య, సోడం జనకమ్మ, వినోద్ పాల్గొన్నారు.

### మంత్రి పరామర్శ



పెద్దవంగర: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ టీచర్ ఎడ్ల రామచంద్రారెడ్డి సతీమణి ఉపేంద్ర వయోభారంతో మృతి చెందాడు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించాడు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రయ్య శర్మ, ఈదురు ఐలయ్య పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పరామర్శ**

చిన్నగూడూరు: మండలంలోని పగిడిపల్లి గ్రామానికి చెందిన గంధసిరి లింగయ్య(69) శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్ శ శనివారం గ్రామానికి చేరుకుని లింగయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

### జోరుగా ఇసుక రవాణా

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ఆఖేరు వాగు పరిసర ప్రాంతాల నుంచి జోరుగా అక్రమంగా ఇసుక రవాణా కొనసాగుతుంది. నెల్లికుదురు మండలం మునిగలవీడు, నర్సింహులపేట మండలం జయ్యారం పరిధిలోని ఆఖేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా కొనసాగుతుంది. గతనెలలో మునిగలవీడు శివారు ఆఖేరు వాగుకు వెళ్లే రహదారిపై నెల్లికుదురు పోలీసులు కందకాలు తవ్వించారు. అక్రమ ఇసుకాసురులు మాకు అడ్డెవ్వరు అన్నపందాలో పోలీసులు తీయించిన కందకాలను పూడ్చి మరీ ఇసుక దందాను నేరుగా కొనసాగిస్తున్నారు. ఎన్నికల హడావుడిలో అధికారులు బిజీగా ఉన్న విషయాన్ని గమనించిన ఇసుకాసురులు తమ ఇష్టం వచ్చినట్లు ఇసుక రవాణా నిర్వహిస్తున్నారు. ఇసుక రవాణాను అడ్డుకుని భూగర్భ జలాలను అడుగంటకుండా కాపాడాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

# ఎంగిలిపూల బతుకమ్మ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ.. తీరొక్క పూలతో అలంకరించిన అందమైన బతుకమ్మలతో ప్రతీ ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ఊరూరా, వాడవాడలా బతుకమ్మలతో ఆలయాల వద్దకు మహిళలు శనివారం ఆనందోత్సాహాల నడుమ చేరుకొని భక్తిశ్రద్ధలతో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటు ఆడిపాడి అనంతరం చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కురవి: పెద్ద చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గూడూరు: లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో..



కేసముద్రంవిలేజ్‌లో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్



మహబూబాబాద్: కంకరబోడ్‌లో..



మానుకోట సెవెన్ హిల్స్ కాలనీలో కృత్రిమంగా చేసిన కొలనులో నిమజ్జనం చేస్తున్న మహిళలు



కొత్తగూడలో..



మహబూబాబాద్ రూరల్: పర్వతగిరి గ్రామంలో..



నెల్లికుదురు: ఎర్రబెల్లిగూడెం గ్రామంలో..



నెల్లికుదురు: బతుకమ్మతో చిన్నారి



మహబూబాబాద్: సెవెన్ హిల్స్‌కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మహబూబాబాద్ అర్బన్: బతుకమ్మతో చిన్నారి



మానుకోట వేణుగోపాలస్వామి ఆలయంలో..



బయ్యారం: రంగాపురం ముత్యాలమ్మ ఆలయం వద్ద..



నర్సింహులపేటలో..



తొర్రూరు రూరల్: గుర్తూరులో..



తొర్రూరు: బతుకమ్మ వేడుకల్లో మహిళలు



చిన్నగూడూరు: మండల కేంద్రంలో..



దంతాలపల్లిలో..



మరిపెడలో..



పెద్దవంగరలో..



మరిపెడ రూరల్: వీరారంలో..



డోర్నకల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు కాలం చెల్లింది



ప్రజలతో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను, యువతను మోసం చేసిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు ఇక కాలం చెల్లిందని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారంలో పల్లెపల్లెకు బీజేపీ ఇంటింటికి హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర శనివారం నిర్వహించారు ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్లు తానే స్వయంగా నిర్మించి ఇస్తామని, కేసీఆర్ మోసం చేసిండన్నారు. 57 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ ఇస్తామని అని చెప్పి ఇవ్వడం లేదన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తా అని మోసం చేసిన బీఆర్‌ఎస్‌ను ఎన్నికల్లో రైతులు బొందపెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కోటి, జాటోతు సంతోష్, ఉమ్మడి వరంగల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామచందర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ సిద్ధార్థ రెడ్డి, పల్లే సందీప్, వెన్నేమల్ల సందీప్, సురేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రవళిక మృతికి ప్రభుత్వమే కారణం



కేసముద్రం: రాస్తారోకో చేస్తున్న నాయకులు

కేసముద్రం: నిరుద్యోగ యువతి ప్రవళిక ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలంటూ మండల కేంద్రంలోని అంబేడ్కర్‌సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. గ్రూప్–2 వాయిదా కారణంగా ప్రవళిక ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరం అన్నారు. రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచిపోగా, సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి, రాస్తారోకోను విరమింపజేశారు. నిరుద్యోగిని ప్రవళిక ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే భాధ్యత వహించాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్‌స్టాలిన్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, పట్టణ అధ్యక్షుడు రావుల మురళీ, కోశాధికారి చిదురాల వసంతరావు, మాసాడి శ్రీనివాస్, పోకల శ్రీనివాస్, ఎండి.తాజుద్దీన్ పాల్గొన్నారు.

తొర్రూరు: ప్రవళికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సురేష్‌బాబు, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర నాయకుడు గుగులోతు అరుణ్ అన్నారు. శనివారం సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు హరీశ్, శివాజీ, నితిన్, ఉదయ్, కుమార్, రవి, సాయి, రాజేష్‌లు పాల్గొన్నారు.

గార్ల: ప్రవళికది ప్రభుత్వ హత్యేనని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదువుకొని పరీక్షలకు సిద్ధం అవుతున్న తరుణంలో ప్రభుత్వం పరీక్షలను రద్దుచేయడం, పేపర్ లీకేజీ పరంపరతో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవళిక ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ అఖిలపక్షం పార్టీల నాయకుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక నెహ్రూసెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు కందునూరి శ్రీనివాసరావు, కట్టెబోయిన శ్రీనివాసరావు, సక్రు, వెంకన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మద్యం, గుడుంబా స్వాధీనం



దంతాలపల్లి: పట్టుబడిన మద్యం సీసాలను చూపుతున్న పోలీసులు

దంతాలపల్లి: అక్రమంగా విక్రయిస్తున్న రూ. 33 వేల విలువైన మద్యం, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని 4 బెల్టుషాపుల్లో 20 లీటర్ల మద్యం, 45 బీర్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ. 33 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం బెల్టుషాపుల నిర్వాకులు చీకటి రామనర్సయ్య, చీకటి రమేష్, దుబ్బాకుల అవినాష్, కటకం జ్యోతిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే, మండలంలోని రామానుజపురం గ్రామంలో మల్లం వెంకటయ్య ఇంటిపై సోదాలు నిర్వహించి 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

నెల్లికుదురు: మండలంలోని చిన్ననాగారం, నెల్లికుదురు మండలం మునిగలవీడు శివారు టీక్యా తండాలో మద్యం, గుడుంబాను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. చిన్ననాగారం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పోలోజు దివాకరాచారి, బైరు వెంకటేశ్వర్లు కిరాణం షాపులో సోదాలు చేయగా సుమారు రూ. 20వేల విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. టీక్యాతండాలో గుగులోతు మంగమ్మ అక్రమంగా నిర్వహిస్తున్న గుడుంబా స్థావరంపై దాడులు నిర్వహించి బెల్లం పానకం ధ్వంసం చేసి సుమారు 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

**గార్లలో..**

గార్ల: మండలంలోని పూసలతండా గ్రామానికి చెందిన భూక్యా బిక్కి ఇంట్లో కాపుసారా కాచి విక్రయిస్తుండగా శనివారం పోలీసులు దాడులు చేసి 10లీటర్ల కాపుసారా, 50లీటర్ల బెల్లంపానకంను స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు.

## సంక్షిప్త సమాచారం

**గాలికుంటు వ్యాధికి నివారణ టీకాలు**

కురవి: మండలంలోని సూదనపల్లి గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలను పశువైద్యాధికారి రాంచందర్ అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వరంగల్‌కు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు హరిప్రియ, కీర్తన, ప్రవళిక, రికిత, రంజని పాల్గొన్నారు.

**ఎస్సారెస్పీ కాల్వ పరిశీలన**

డోర్నకల్: మండలంలోని హూన్యాతండా శివారులోని 20 ఎల్ ఎస్సారెస్పీ కాల్వను ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. కురవి మండలం హరిదాసుతండాకు చెందిన రైతులు ఎస్సారెస్పీ కాల్వకు గండి పెట్టారని హూన్యాతండా రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఎస్సారెస్పీ కాల్వను పరిశీలించారు.

**కాంగ్రెస్ యూత్ గ్రామ కమిటీ ఎన్నిక**

గూడూరు: గ్రామాల్లో యూత్ కమిటీ సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు బొల్లికొండ మధుగౌడ్ అన్నారు. మండలంలోని భూపతిపేట, చిన్న ఎల్లాపురం గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ గ్రామ యూత్ కమిటీలను ఎన్నుకున్నారు. భూపతిపేట అధ్యక్షుడిగా ఎల్లబోయిన కార్తీక్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి కిరణ్‌గౌడ్, కార్యదర్శి ఎస్కే. షాబీర్, సహాయ కార్యదర్శి సతీష్, కోశాధికారి సురేష్, చిన్న ఎల్లాపురం అధ్యక్షుడిగా అవుల మహేష్, ఉపాధ్యక్షులు యాకూబ్, రాజ్‌కుమార్, కార్యదర్శి వీరన్న, సహాయ కార్యదర్శి కిషన్, కోశాధికారి హట్టిని ఎన్నుకున్నారు.

**ఆర్థికసాయం**

దంతాలపల్లి: మండంలోని దాట్ల గ్రామంలో ఇటీవల వైద్య వికటించి దివ్యాంగుడు యాకయ్య మృతి చెందాడు. శనివారం మృతుడి పదో తరగతి మిత్రులు కలసి బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

**అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి**

మహబూబాబాద్ రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని బెస్తబజారులో శనివారం చోటుచేసుకుంది. టౌన్ సీఐ వై.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం .. జిల్లా కేంద్రంలోని బెస్తబజారులో నివాసం ఉండే ఆటో డ్రైవర్ షేక్.యూసుఫ్ (42) భార్య మహబూబీ, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులందరూ భోజనం చేసి నిద్రించారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో యూసుఫ్ నిద్రించిన గదిలో కూలర్ శబ్దం రావడంతో భార్య నిద్రలేచి చూసేసరికి యూసుఫ్ అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అతడు మృతి చెందాడని నిర్ధారించారు. కాగా యూసుఫ్ మృతిపై తమకు అనుమానం ఉందని, ఆయన మృతికి గల కారణాలు తెలుసుకుని తమకు న్యాయం చేయాలని అతడి సోదరి ఖరీజా మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిక**

కొత్తగూడ: మండలంలోని జంగవానిగూడెం సర్పంచ్ ఈసం స్వామి, ఉప సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్ శనివారం ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

## బంతిపూల సాగు.. లాభాలు బాగు



బంతిపూలు కోస్తున్న మహిళా రైతు

డోర్నకల్: మండలంలో బంతిపూల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. డోర్నకల్ మండలంలో బంతి పూల పంట అధికంగా సాగవుతుండగా కురవి, మరిపెడలోనూ బంతిపూల పంటను సాగు చేస్తున్నారు. మూడు నెలల కాలపరిమితి పంట కాగా బతుకమ్మ పండుగ, దసరా, దీపావళి, కార్తీక పౌర్ణమి, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలతోపాటు అయ్యప్పమాలధారణ సమయంలో సాగుతో బంతిపూలు అందుబాటులో ఉంటున్నాయి. ముల్కలపల్లి, రావిగూడెం, బొడ్రాయితండా తదితర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో బంతిపూల పంటను సాగు చేస్తున్నారు. ఖమ్మం నగరానికి అతిసమీపంలో ఉండటంతో రైతులు ప్రతీ రోజూ క్వింటాళ్ల కొద్ది పూలను ఖమ్మం మార్కెట్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం బంతి పూలు కిలో రూ.70 నుంచి రూ.100 వరకు పలుకుతుందని, బంతి సాగు లాభదాయకంగా ఉందని రైతులు చెబుతున్నారు.

## రోడ్డు నాణ్యతపై ప్రశ్నించరా?



డోర్నకల్: చిలుకొయ్యలపాడు, మన్నెగూడెం మధ్య నిర్మించిన రోడ్డుకు సంబంధించి నాణ్యతా లోపాలను అధికార పార్టీ నేతలు ఎందుకు ప్రశ్నించడం లేదంటూ చిలుకొయ్యలపాడు సర్పంచ్ నాగటి ఉపేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని చిలుకొయ్యలపాడు గ్రామంలో శనివారం సమావేశంలో మాట్లాడుతూ.. రెండున్నర కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన రోడ్డు కొద్ది రోజులకే నాణ్యతా లోపంతో రోడ్డు ధ్వంసమైందన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతోనే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పంచాయతీ కార్యదర్శి బహిరంగంగా ప్రకటించారని అన్నారు. సమావేశంలో వార్డు సభ్యులు వార్డు సభ్యులు గుగులోత్ సోమన్న, బోయిన రమ, జోగి సునీత, బానోత్ బుజ్జి, మేకల వీరన్న, రవికుమార్ పాల్గొన్నారు.